సాక్షి ఒడిశా

ఆదివారం । 2 । జూన్ । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు: రూ. 5,98,520

బంగారం: 3 గ్రాముల 550 మిల్లీ గ్రాములు

వెండి: 83 గ్రాముల 100 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



సారాబట్టీలపై దాడులు

జయపురం అబ్కారీ, జయపురం సదర్ పోలీసులు సంయుక్తంగా జయపురం సమితి కొలాగుడ గ్రామ ప్రాంతంలో నాటుసారా బట్టీలపై దాడులు నిర్వహించారు.

- 8లో



6 క్వింటాళ్ల గంజాయి పట్టివేత

మల్కన్‌గిరి జిల్లా మల్కన్‌గిరి సమితి సింద్రీమాల గ్రామం వద్ద శుక్రవారం రాత్రి ఓ ట్రాక్టర్‌లో ఉంచిన ఆరు క్వింటాళ్ల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

పకడ్బందీగా పోలింగ్ వెబ్‌కాస్టింగ్



వెబ్‌కాస్టింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్రంలో చివరి దశ ఎన్నికల ప్రక్రియలో పలు చోట్ల ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగు వ్యవస్థను ప్రధాన ఎన్నికల అధికారి, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి, సంయుక్త ఎన్నికల ప్రధాన అధికారులు ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ప్రతి జిల్లా ప్రధాన కేంద్రంలో ఈ వ్యవస్థ ఆధ్వర్యంలో పోలింగు తాజా పోకడల్ని పరిశీలించారు.

ఎస్‌డీసీ సభ్యుని మృతి



డొంబురు చౌధరి (ఫైల్)

రాయగడ: స్వతంత్ర్య ప్రణాళిక మండలి (ఎస్‌డీసీ) సభ్యునిగా విధులు నిర్వహిస్తున్న డొంబురు చౌదరి (69) కన్నుమూశారు. గత కొద్ది రోజులుగా తీవ్ర అనారోగ్యం కారణంగా ఆయన విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అక్కడే శనివారం వేకువజామున ఆయన మృతి చెందారు. జిల్లాలోని బిసంకటక్‌కు చెందిన ఆయన గత రెండు దశాబ్దాలుగా బీజేడీలో సేవలు అందించారు. ఇది గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఆయనను ఎస్‌డీసీలో సభ్యునిగా గత ఏడాది నియమించింది. ఆయన అకాల మృతిపై బీజేడీ నాయకులు, కార్యకర్తలు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

25 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయితో దొరికిన నిందితుడు

రాయగడ: స్థానిక రైల్వే స్టేషన్ ఒకటో నంబరు ప్లాట్ ఫారం వద్ద అనుమానాస్పదంగా కనిపించిన ఒక యువకుడిని రైల్వే పోలీసులు పట్టుకున్నారు. అతని బ్యాగులు తనిఖీ చేయగా 25 కిలోల గంజాయి దొరికింది. అరెస్టయిన వ్యక్తిని జిల్లాలోని అంతర్‌జొల గ్రామానికి చెందిన కిషన్ నాగ్ (22)గా గుర్తించారు. రాయగడ నుంచి చత్తీస్‌గఢ్‌కు గంజాయిని తరలించేందుకు నిందితుడు సన్నాహాలు చేస్తుండగా పోలీసులకు దొరికిపోయాడు. ఈ గంజాయి విలువ రూ.2.5 లక్షలు ఉంటుందని అంచనా. దీనిపై కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు నిందితుడిని శనివారం కోర్టుకు తరలించారు.

పిడుగుపాటుకు 5 పశువులు మృతి



మృతి చెందిన పశువులు

రాయగడ: పిడుగుపాటుకు ఐదు పశువులు మృత్యువాత పడ్డాయి. జిల్లాలోని కళ్యాణసింగుపూర్ సమితి సునాఖండి పంచాయతీలోని అలజినిగుడ గ్రామంలో ఈ సంఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతోపాటు పిడుగు పడడంతో పచ్చిక మేసేందుకు వెళ్లిన పశువులు చనిపోయాయి. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు విషయాన్ని రెవెన్యూ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మజ్జిగుడ సర్కిల్ పరిధి రెవెన్యూశాఖ అధికారి నిమిత రాణి గొమాంగో శనివారం నాడు సంఘటా స్థలాన్ని పరిశీలించారు. పశువులు మృతి చెందిన విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేసి తగిన నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తామని బాధితులకు హామీ ఇచ్చారు.

వలస కార్మికుని మృతి

రాయగడ: ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వెళుతున్న వలస కార్మికుల మరణాలు జిల్లాలో ఆందోళన కలిగిస్తున్నాయి. జిల్లాలోని కాసీపూర్ సమితి తొలామల్లిగా గ్రామానికి చెందిన మునీశ్వర్ గొడో కుమారుడు హలధర్ గొడో (24) తాజాగా కేరళ రాష్ట్రంలో ప్రాణాలు కోల్పోయాడు. గొడో మృతికి సంబంధించి తండ్రి మునిశ్వర్ కాసీపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గత ఎనిమిది నెలల క్రితం హలధర్ కేరళలోని కొయికట్ జిల్లా పాయిపుల్లి పోలీస్ స్టేషన్ పరిధి టికుడి గ్రామంలోని ఓ ప్రైవేట్ సంస్థలో పనిలో చేరాడు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు తన కొడుకు ఉరివేసుకుని మృతి చెందాడని కుటుంబీకులకు అదేరోజు రాత్రి ఫోన్ ద్వారా సమాచారం వచ్చింది. అయితే తన కొడుకు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడా, లేదా ఇది ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారా అనే సందేహంతో పోలీసులు దర్యాప్తు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

చివరి విడత పోలింగ్ హింసాత్మకం

- కేంద్రాపడాలో బీజేపీ బూత్ ప్రెసిడెంట్‌పై దాడి
- జాజ్‌పూర్‌లో గుండెపోటుతో అధికారి మృతి



ఓటు వేసేందుకు వెళ్తున్న ప్రతాప్‌చంద్ర షడంగి



భువనేశ్వర్: రాష్ట్రంలో పలుచోట్ల శనివారం జరిగిన చివరి దశ పోలింగ్‌లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. కేంద్రాపడా లోక్‌సభ నియోజక వర్గంలో బీజేడీ కార్యకర్తలు కత్తితో పొడిచి బీజేపీ బూత్ ప్రెసిడెంట్‌ని తీవ్రంగా గాయపరిచారు. ఈ ఘటన కేంద్రాపడాలోని 35వ నంబర్ బూత్ వద్ద జరిగినట్లు సమాచారం. హింసాత్మక ఘటనపై స్థానిక బీజేపీ కార్యకర్తలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరో ఘటనలో, కేంద్రాపడా జిల్లా పరిధిలోని పట్టముండై నీలకంఠపూర్ పంచాయతీలో కొంత మంది బీజేడీ కార్యకర్తలు పదునైన ఆయుధంతో దాడి చేయడంతో రష్మి రంజన్ జెనా అనే బీజేపీ కార్యకర్త గాయపడ్డాడు. కటక్ జిల్లా సాలేపూర్ ప్రాంతంలో పోలింగ్ జరుగుతున్నప్పుడు బూత్ నంబర్ 184, 185 వద్ద బీజేడీ కార్యకర్తలు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏజెంట్, మరో ముగ్గురిపై హత్యాయత్నం దాడి చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. కాగా, బూత్ కబ్జా ఆరోపణ పూర్తిగా అవాస్తవమని కటక్ జిల్లా మేజిస్ట్రేట్ ఖండించారు.

పోలింగ్ బూత్ ఆవరణలో భార్యను హతమార్చిన భర్త

భువనేశ్వర్: ఓ వ్యక్తి తన భార్యను పోలింగ్ బూత్ ఆవరణలో కత్తితో పొడిచి హత్య చేసిన ఘటన భద్రక్ జిల్లాలో శనివారం చోటుచేసుకుంది. భద్రక్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జొరొగంభీరా గ్రామానికి చెందిన రష్మీరేఖ బెహెరాకు ఐదేళ్ల కిందట ముక్తాడిహి గ్రామానికి చెందిన ప్రభాకర్ రౌత్‌తో వివాహం జరిగింది. వీరికి మూడేళ్ల క్రితం కుమారుడు జన్మించాడు. తర్వాత వీరి మధ్య విభేదాలు తలెత్తాయి. దీంతో కొన్ని నెలల క్రితం రష్మీ తన గ్రామంలోని తల్లిదండ్రుల చెంతకు చేరింది. రాష్ట్రంలో చివరి దశ ఎన్నికల సందర్భంగా ముక్తాడిహి గ్రామంలో ఓటు వేయడానికి శనివారం ఆమె తన మామతో కలిసి వచ్చింది. ఓటు వేసేందుకు క్యూలో వేచి ఉండగా భర్త ప్రభాకర్ రౌత్ అక్కడికి వచ్చి పదునైన ఆయుధంతో దాడి చేశాడు. రష్మీకి తీవ్ర గాయాలై రక్తపు మడుగులో కుప్పకూలిపోవడంతో గ్రామస్తులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. సమాచారం అందుకున్న భద్రక్ రూరల్ పోలీస్ ఠాణా బృందం ఘటనా స్థలానికి చేరి విచారణ చేపట్టారు. ప్రభాకర్‌ను అదుపులోకి తీసుకుని రష్మి మృతదేహాన్ని పంచనామా కోసం తరలించారు.

ఆన్‌–డ్యూటీ పోలింగ్ అధికారి మృతి

భువనేశ్వర్: జాజ్‌పూర్ జిల్లా ఓలిచందన్‌పూర్ 157వ నంబర్ బూత్‌లో శనివారం ఎన్నికల విధుల్లో ఉన్న బూత్ స్థాయి అధికారి (బీఎల్‌ఓ) గుండెపోటుతో అనుమానాస్పదంగా మృతి చెందాడు. మృతుడు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మనోరంజన్ సాహుగా గుర్తించారు. విధి నిర్వహణలో ఉండగా తనకు అసౌకర్యంగా అనిపిస్తుందని అధికారులకు తెలియజేశాడు. వెంటనే బింజార్‌పూర్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. అక్కడ వైద్యులు వచ్చేలోగా మరణించినట్లు ప్రకటించారు. వేడిగాలులు, తేమ ఎక్కువగా ఉండటం వల్లే ఆయనకు స్ట్రోక్ వచ్చిందని అనుమానిస్తున్నారు. మరో ఘటనలో, జాజ్‌పూర్ జిల్లాలోని బింజార్‌పూర్‌లో బీఎల్‌ఓ మనోరంజన్ సాహూ విధి నిర్వహణలో మరణించారు.

బాలాసోర్‌లో వృద్ధ ఓటరు మృతి

భువనేశ్వర్: బాలాసోర్ లోక్‌సభ స్థానం పరిధి నీలగిరి శాసన సభ నియోజక వర్గంలో చివరి దశ ఎన్నికల పోలింగ్ కేంద్రంలో శనివారం 80 ఏళ్ల ఓటరు ఆకస్మికంగా మరణించాడు. మృతుడు సురేంద్ర మహంతిగా గుర్తించారు. తన భార్యతో కలిసి నీలగిరిలోని ఈశ్వర్‌పూర్ గ్రామంలోని బూత్ నంబర్ 159కి ఓటు వేయడానికి రాగా, బూత్ లోపల అపస్మారక స్థితిలో పడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

సైకిల్‌పై వెళ్లి ఓటేసిన ఎంపీ అభ్యర్థి

భువనేశ్వర్: బీజేపీ బాలాసోర్ లోక్‌సభ అభ్యర్థి ప్రతాప్ చంద్ర షడంగి శనివారం జరిగిన ఎన్నికల్లో ఓటు వేసేందుకు సైకిల్‌పై పోలింగ్ కేంద్రానికి వెళ్లడం విశేషం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు వేయడం పౌరుని హక్కు అని, దేశ ప్రయోజనాల కోసం ప్రతిఒక్కరూ ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి



లాభాల నిరంజన్ కుమార్ మృతదేహం



నిరంజన్ కుమార్ (ఫైల్)



విలపిస్తున్న మృతుని భార్య, బంధువులు

పర్లాకిమిడి: రోడ్డు ప్రమాదంలో గుమ్మా సమితి కె.సి.పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు లాభాల నిరంజన్ కుమార్ (41) మృతి చెందారు. పర్లాకిమిడి గాజుల వీధికి చెందిన లాభాల నిరంజన్ (నాని) గుమ్మ సమితి కె.సి.పూర్ ప్రభుత్వ పాఠశాలకు శనివారం తన బైక్‌పై వెళ్తున్నారు. జంగిల్ జంక్షన్ మలుపు వద్ద ఉదయం 11 గంటల సమయంలో గుమ్మ నుంచి వస్తున్న వాహనాన్ని ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. తలకి తీవ్ర గాయం కావడంతో పర్లాకిమిడి ప్రభుత్వ ఆస్పత్రికి స్థానికులు 108 అంబులెన్స్‌లో తరలించారు. డాక్టర్లు ప్రథమ చికిత్స చేస్తుండగానే నిరంజన్ కుమార్ ప్రాణాలు విడిచారు. సమాచారం తెలుసుకున్న భార్య, బంధువులు ఆస్పత్రికి చేరుకొని నిరంజన్ మృతదేహాన్ని చూసి గుండెలవిసేలా రోదించారు. నిరంజన్ కుమార్‌కు భార్య, ఒక అమ్మాయి, అబ్బాయి ఉన్నారు. ఆయన మృతితో పర్లాకిమిడి గాజులవీధిలో విషాదం అలముకుంది.

3న విశాఖ– గుణుపురం ప్యాసింజర్ రద్దు

పర్లాకిమిడి: వాల్తేరు రైల్వే డివిజన్‌లో బ్రిడ్జిల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనుల దృష్ట్యా 08522– విశాఖపట్నం– గుణుపురం ప్యాసింజర్, గుణుపురం – విశాఖపట్నం ప్యాసింజర్ జూన్ 3న రద్దు చేస్తున్నట్టు ఈస్టుకోస్టు రైల్వే, వాల్తేరు డివిజన్ అధికారులు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

దోపిడీ దొంగల ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్ వర్మ

జయపురం/కొరాపుట్: ఇంట్లో చొరబడి దోపిడీకి పాల్పడిన దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు నవరంగపూర్ జిల్లా ఎస్పీ రోహిత్ వర్మ శనివారం వెల్లడించారు. గత ఏడాది నవంబర్ 14న అర్ధరాత్రి 8 మంది గుర్తు తెలియని దుండగులు డొంగర్‌బెజ గ్రామంలో సునీల్ సాహు ఇంటి తలుపుల తాళాలు బద్దలు కొట్టి లోపలికి చొరబడి, 4 బంగారు గొలుసులు, 8 బంగారు గాజులు, బంగారు చెవి రింగులు, 2 బంగారు ఉంగరాలు, రూ.17 వేల నగదు దోచుకుపోయారని వివరించారు. సునీల్ సాహు ఇంట్లో అద్దెకుంటున్న రోహిత్ బెహరా, కుటుంబ సభ్యులను పిస్టల్, కత్తులు చూపి చంపుతామని బెదిరించి ఈ చోరీకి పాల్పడ్డారని వెల్లడించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నవరంగపూర్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా 12 మంది నిందితులను అరెస్టు చేశామన్నారు. వీరిలో జయపురం సమితి ఉమ్మిరి గ్రామానికి చెందిన శంకర హరిజన్, తెలియా గ్రామానికి చెందిన వికాశ హరిజన్, మ్మిరి గ్రామానికి చెందిన బికాశ హరిజన్, హటపాదర వీధికి చెందిన సన్యాసి బెనియ, బిరేంద్ర టక్రి, క్రిష్టియన్‌పేటకు చెందిన అక్బర్‌గరడ, బాసుదేవ్‌గుడకు చెందిన ఆనంద హరిజన్, బొడిగాంకు చెందిన బొడు జాని, మునిగుడకు చెందిన సుశాంత ఖండపాన్, భూతివీధికి చెందిన



స్వాధీనం చేసుకున్న మారణాయుధాలు

ఎల్.అశోక్ కుమార్, సేనాపతి వీధికి చెందిన జోహణజతిన్ సున, మహానందియ గ్రామానికి చెందిన బిరెన్ మహానందియ ఉన్నట్లు వెల్లడించారు. వీరి వద్ద నుంచి 12 సెల్‌ఫోన్లు, 28.4 గ్రాముల బంగారం, 300 గ్రాముల వెండి ఆభరణాలు, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సునీల్ సాహు ఇంటిలో ఎన్నికల ప్రచార నిమిత్తం కోట్లాది రూపాయల డబ్బు ఉంటుందని దుండగులు భావించి ఆయుధాలతో చొరబడ్డారని, అక్కడ ఏమీ లభించక పోవటంతో అక్కడే అద్దెకు ఉంటున్న రోహిత్ బెహరా ఇంటిలో బెదిరించి చోరీకి పాల్పడ్డారని చెప్పారు. వీరందరిపైనా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. విచారణలో నవరంగపూర్ పట్టణ పోలీసు అధికారి బి.కె.ప్రైె, సబ్‌ఇన్‌స్పెక్టర్ సబీర్ అహమ్మద్, ఏఎస్‌ఐ తులశీరామ్ పూజారితో పాటు పోలీసు సిబ్బంది, సైబర్ సెల్ సిబ్బంది సహకరించినట్లు తెలిపారు.

ఘనంగా హనుమాన్ జయంతి



కోదండరామాలయం ప్రాంగణంలో సహస్ర కుంకుమార్చన పూజల్లో మహిళలు



పూజలందుకుంటున్న హనుమాన్

రాయగడ: పట్టణంలో గల వివిధ హనుమాన్ మందిరాల్లో శనివారం హనుమాన్ జయంతి నిర్వహించారు. స్థానిక కరణం వీధి సమీపంలో గల కోదండ రామ మందిరంలో ప్రధాన అర్చకులు అనంతాచార్యులు ఆధ్వర్యంలో శనివారం సహస్ర కుంకుమార్చన పూజలు జరిగాయి. ముందుగా హనుమాన్ విగ్రహానికి క్షీరాభిషేకం, తమలపాకులతో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అదేవిధంగా స్థానిక బాలాజీ నగర్‌లో గల శ్రీకల్యాణవేంకటేశ్వర ఆలయం ప్రాంగణంలో గల హనుమాన్ మందిరంలో నిర్వహించిన పూజలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

భక్తిశ్రద్ధలతో హనుమద్‌జయంతి



పర్లాకిమిడిలో హనుమాన్ జయంతి వేడుకలు



శ్రీవేంకటేశ్వర మందిరంలో హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భద్రం చక్రధర్

పర్లాకిమిడి: స్థానిక తొమ్మిదో వార్డు రంగిరీజు వీధిలో ఉన్న వెంకటేశ్వర స్వామి మందిర ప్రాంగణంలోని హనుమాన్ కోవెలలో వైశాఖ మాసం, కృష్ణపక్షం, దశమిలో వచ్చే శ్రీవైష్ణవ హనుమద్‌జయంతిని వైభవంగా నిర్వహించారు. భద్రం శ్రీనివాసాచార్యులు, చక్రధర్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. భక్తులు స్వామిని పెద్ద ఎత్తున దర్శించుకున్నారు.

ఆకర్షణీయంగా పోలింగ్ కేంద్రాలు



పూరీ జిల్లా కాకత్‌పూర్‌లో ఏర్పాటైన విభిన్న తమలపాకు తీగల పోలింగ్ కేంద్రం



దళిత సంప్రదాయానికి అద్దం పట్టిన పీవీటీజీ పోలింగ్ కేంద్రం



సంప్రదాయ దప్పు వాయిద్యంతో ఓటర్లకు స్వాగతం పలుకుతున్న మయూర్‌భంజ్ పోలింగ్ కేంద్రం



కేంద్రాపడా లోక్‌సభ స్థానం రాజకనికా ప్రాంతంలో ప్రముఖ మహిళల చిత్రాలతో రూపుదిద్దుకున్న సఖీ పోలింగ్ కేంద్రం

భువనేశ్వర్: రాష్ట్రంలో చివరి దశ ఎన్నికలు సందర్భంగా పలు చోట్ల ఆకర్షణీయ పోలింగ్ కేంద్రాలు రూపుదిద్దుకున్నాయి. పూరీ జిల్లా కాకత్‌పూర్ శాసనసభ నియోజక వర్గంలో ఓటర్లకు పర్యావరణ అనుకూలమైన తమలపాకు తీగ థీమ్‌తో ఏర్పాటు చేసిన ప్రత్యేక పోలింగ్ కేంద్రం ప్రత్యేకత చాటుకుంది. వినూత్న ఆలోచనతో చల్లని తమలపాకు పొదల గుండా వెళ్లి ఓటు వేయడం ఓటరుని ఎంతగానో ఆకట్టుకుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ప్రశంసించారు. స్థానిక సంప్రదాయాలు, పర్యావరణ అనుకూలత, మహిళా సాధికారిత వంటి థీమ్‌తో ఏర్పాటైన పోలింగు కేంద్రాలు సృజనాత్మకతకు అద్దం పట్టాయి. మయూర్‌భంజ్‌లో కొబ్బరి, ఖర్జూరాలు, మామిడి ఆకులను సృజనాత్మకంగా అలంకరించారు. ఆదిమ దుర్బల దళిత వర్గం (పీవీటీజీ) సుసంపన్నమైన సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెబుతూ పోలింగ్ బూత్‌ను సిద్ధం చేశారు. కేంద్రాపడా లోక్ సభ నియోజక వర్గం రాజకనికా ప్రాంతంలో మహిళల ఆధ్వర్యంలో సఖీ పోలింగ్ కేంద్రం మహిళా సాధికారతని వెలుగెత్తి చాటింది. అత్యున్నత శిఖరాల్ని అధిరోహించిన ప్రముఖ మహిళా వ్యక్తుల చిత్రాలతో అందంగా అలంకరించి ఓటరుకు స్వాగతం పలికారు.

ఎస్‌బీఐ విశ్రాంత ఉద్యోగుల ఔదార్యం

జయపురం: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జయపురం విశ్రాంత ఉద్యోగులు శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం వరకు బ్యాంక్ ఎదుట వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. బ్యాంకుకు వచ్చిన ఖాతాదారులకు, పెన్షన్‌దారులకు మండుటెండలో చల్లని తాగునీరు అందించారు.



వాటర్ ప్యాకెట్లు అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

బిసంకటక్ బస్టాండ్‌లో అగ్ని ప్రమాదం



దట్టమైన పొగతో నిండిపోయిన బస్టాండ్



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ బస్టాండ్‌లో శనివారం మధ్యాహ్నం నాలుగు గంటల సమయంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఘటనలో నాలుగు ప్రైవేటు బస్సులు దగ్ధమయ్యాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను నియంత్రించారు. మంటలను అదుపు చేసేందుకు సుమారు గంట సమయం పట్టింది. ఈ ప్రమాదం కారణంగా దట్టమైన పొగ అలముకోగా.. పరిసర ప్రాంతాల్లోని ప్రజలు భయాందోళనకు గురయ్యారు. దగ్ధమైన నాలుగు బస్సులు ఒకే వ్యక్తికి చెందినవిగా సమాచారం. నాలుగు రూట్లలో నడిచే ఈ బస్సులు బస్టాండ్‌లో ఉండగా రెండు బస్సుల్లో ప్రయాణికులు కూడా కూర్చున్నారు. అగ్ని ప్రమాదం జరిగిందని తెలియగానే వారంతా బస్సుల నుంచి దిగిపోయారు. దీంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

క్లుప్తంగా

వ్యవసాయ పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ఆమదాలవలస రూరల్: మండలంలో తొగరాం గ్రామంలో గల ప్రభుత్వ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత పొందిన వారితో పాటు ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు అర్హులని తెలిపారు. 2023 ఆగస్టు 31వ తేదీకి 15 నుంచి 22 ఏళ్ల లోపు వయసు ఉండాలని, 2022 ఆగస్టు 31వ తేదీ నుంచి 2009 ఆగస్టు 31వ తేదీ లోపు జన్మించి ఉండాలన్నారు. గ్రామీణ, మున్సిపాలిటీల్లో ఇంగ్లిష్ మీడియంలో చదివిన వారికి 75:25 నిష్పత్తిలో సీట్లు కేటాయింపులు జరుగుతాయని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి జూన్ 20వ తేదీ వరకు గడువు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు అడ్మిషన్లు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి సందేహాలు ఉన్నా 9705209418 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఒక విద్యార్థి.. తొమ్మిది మంది సిబ్బంది

టెక్కలి రూరల్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో విచిత్ర పరిణామాలు చోటుచేసుకున్నాయి. స్థానిక జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో శనివారం సంస్కృతం పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు ఒకే ఒక విద్యార్థి హాజరయ్యాడు. పరీక్ష నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్ యు.గణపతిరావు, డిపార్ట్‌మెంట్ అధికారిగా బి.శేషగిరిలు విధులు నిర్వర్తించగా వారితో పాటు ఒక ఇన్విజిలేటర్, ఇద్దరు ఆరోగ్య సిబ్బంది, ఒక క్లర్క్, ఇద్దరు ఆయాలు, పోలీస్ కానిస్టేబుల్ మొత్తం కలిపి 9 మంది సిబ్బంది విధుల్లో పాల్గొన్నారు. గడిచిన వారం రోజులుగా జరుగుతున్న ఈ పరీక్షలు శనివారంతో ముగియగా అధిక శాతం మంది విద్యార్థులు గైర్హాజరు కావడం గమనార్హం.

రిమ్స్ న్యూరో విభాగం హెచ్‌ఓడీగా డాక్టర్ సీహెచ్ సురేంద్రకుమార్


డాక్టర్ సీహెచ్. సురేంద్రకుమార్

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ న్యూరో వైద్య కళాశాలలోని న్యూరాలజీ విభాగం అధిపతిగా డాక్టర్ సురేంద్రకుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. నెల్లూరులో న్యూరోసర్జన్‌గా పనిచేస్తున్న ఆయనను శ్రీకాకుళంకు పదోన్నతిపై బదిలీ చేశారు. శనివారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. రిమ్స్‌లో న్యూరాలజీ సూపర్ స్పెషాలిటీ సేవలను ప్రభుత్వం ఇటీవలే మంజూరు చేసింది.

ఎక్స్‌లెన్స్ అవార్డులు


ఎక్స్‌లెన్స్ అవార్డు అందజేస్తున్న చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కె.ప్రకాష్

శ్రీకాకుళం అర్బన్: ఆంధ్రా పోస్టల్ సర్కిల్ విశాఖపట్నంలో 2023–2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సర్కిల్ ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానాన్ని చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కె.ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించారు. శ్రీకాకుళం పోస్టల్ డివిజన్‌కు ఎనిమిది అవార్డులు లభించాయి. చిన్న పొదుపు ఖాతాల ప్రారంభం, గ్రామీణ తపాలా జీవిత బీమా, పోస్టల్ లైఫ్ బీమాకు సంబంధించి టి.అమ్మన్నాయుడు, సబ్ డివిజన్ స్థాయిలో ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించినందుకు వై.ఇంద్రసేన, కాశీబుగ్గ సబ్ డివిజన్‌కు అవార్డులు లభించాయి. బీపీఎం స్థాయిలో యు.దూదమ్మ, ఈదుపురం, పోస్టల్ ఖాతాలకు సంబంధించి ఇద్దరు డైరెక్ట్ ఏజెంట్లు శ్రీదేవి, వాణిలకు అవార్డులు లభించాయి. అలాగే ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రతి ఒక్కరినీ సత్కరించి అవార్డులు అందజేశారు.

4న ఎస్‌కేసీజీ కళాశాల వద్ద 144 సెక్షన్


మీడియాతో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి, కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్

పర్లాకిమిడి: ఈ నెల 4న జరగబోయే ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా పర్లాకిమిడి కృష్ణచంద్ర గజపతి కళాశాల మెయిన్ గేట్ నుంచి గుండిచా బడి, హైస్కూల్ జంక్షన్ వరకూ 144 సెక్షన్ అమలు చేస్తున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి స్మృతి రంజన్ ప్రధాన్ ఈ రోజు కలెక్టరేట్‌లో విలేకరులతో తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లోనికి మొబైల్స్ అనుమతించడం లేదని అన్నారు. ప్రతి రౌండు ఫలితాలు మీడియా కేంద్రానికి వెల్లడిస్తామన్నారు. కౌంటింగ్ కేంద్రంలో మీడియా ఓట్ల లెక్కింపు దృశ్యాలు తీయడానికి అనుమతి లేదని కూడా ఒక ప్రశ్నకు బదులిచ్చారు. కలెక్టర్‌తో పాటు ఆదనపు కలెక్టర్ (రెవెన్యూ) బిరేంద్ర కుమార్ దాస్, డి.ఆర్.డి.ఏ. సి.డి.యం. గుణనిధి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

6 క్వింటాళ్ల గంజాయి పట్టివేత


ట్రాక్టర్‌లో ఉన్న గంజాయి బస్తాలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మల్కన్‌గిరి సమితి సింద్రీమాల గ్రామం వద్ద శుక్రవారం రాత్రి ఓ ట్రాక్టర్‌లో ఉంచిన ఆరు క్వింటాళ్ల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పెట్రోలింగ్ చేస్తున్న సిబ్బందికి నిలిపివేసి ఉంచిన ట్రాక్టర్ అనుమానాస్పదంగా కనిపించింది. దీంతో పరిశీలించగా అందులో 24 బస్తాల్లో ఉంచిన ఆరు క్వింటాళ్ల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. దీని విలువ రూ. 50 లక్షలు ఉంటుందని మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్‌కీండో శనివారం తెలిపారు. ట్రాక్టర్ నంబర్ ఆధారంగా చిత్రకొండ సమితి నక్కమామ్ముడి గ్రామానికి చెందిన రాఘు ముదిలికి చెందినదిగా గుర్తించామన్నారు. గంజాయిని ఛత్తీస్‌గఢ్‌కు తరలించే ప్రయత్నం చేస్తున్నట్టు గుర్తించినట్టు పేర్కొన్నారు.

ట్రాక్టర్ బోల్తా:యువకుడి దుర్మరణం


బోల్తాపడిన ట్రాక్టర్


రామచంద్ర మినియాక (ఫైల్)

రాయగడ: ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన జిల్లాలోని కళ్యాణసింగుపూర్ సమితి ఖందాగాడి పంచాయతీ దంతలింగ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. మృతుడు అదే గ్రామానికి చెందిన రామచంద్ర మినియాక (25)గా గుర్తించారు. వ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్‌ను పోలానికి డ్రైవింగ్ చేసుకొని రామచంద్ర మినియాక తీసుకొని వెళ్తుండగా అదుపుతప్పి బోల్తా పడడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ట్రాక్టర్ ఇంజన్ కింద పడిపోవడంతో మినియాక ఊపిరాడక అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ఘటనపై కేసు నమోదు చేసి.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

8కి చేరిన మృతులు

భువనేశ్వర్: పూరి నరేంద్ర సరోవరం తీరంలో బాణసంచా పేలుడు సంఘటనలో మృతుల సంఖ్య 8కి చేరింది. స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శని వారం మరో ఇద్దరు మృతి చెందడంతో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరిందని ప్రత్యేక సహాయ కమిషనరు (ఎస్ఆర్‌సీ) తెలియజేశారు. ప్రస్తుతం, 22 మంది రోగులు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సంఘటనలో మరణించిన ప్రతి వ్యక్తి సమీప బంధువులకు రూ. 4 లక్షలు ఎక్స్‌గ్రేషియా సహాయంగా చెల్లించాలని పూరి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. గత నెల 29న నరేంద్ర సరోవరం చందన్ యాత్రలో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీమన్నారాయణుని తెప్పోత్సవం సందర్భంగా సంభవించిన బాణాసంచా పేలుడు సంఘటనలో మొత్తం 30 మందికి కాలిన గాయాలైన విషయం తెలిసిందే.

సారాబట్టీలపై దాడులు


సారా బట్టీలపై దాడులు చేసిన పోలీసు సిబ్బంది

జయపురం: జయపురం అబ్కారీ, జయపురం సదర్ పోలీసులు సంయుక్తంగా జయపురం సమితి కొలాగుడ గ్రామ ప్రాంతంలో నాటు సారా బట్టీలపై శనివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 40 లీటర్ల సారాతో పాటు సారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన వెయ్యి లీటర్ల ఇప్ప ఊటను ధ్వంసం చేసినట్టు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి తెలిపారు. సారా తయారీకి వినియోగించే సామగ్రిని సీజ్ చేశామన్నారు. సారా తయారీదారులు పరారైనట్టు పేర్కొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి


సబ్‌జైల్ రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

పాతపట్నం: పాతపట్నం సబ్‌జైల్‌లో ఉంటున్న ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. పాతపట్నం సబ్‌జైల్‌ను, పాతపట్నం కోర్టు జడ్జి మానెస్ రోషిణితో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ఖైదీలతో మాట్లాడి వారికి అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. దీర్ఘకాలంగా శిక్ష పడిన దోషులకు న్యాయవాదులు ఉన్నారా లేదా అన్న అంశంపై అక్కడి జైలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు జైలు రికార్డులను పరిశీలించారు. వంటగదులు, స్టోర్ రూమ్‌లను తనిఖీ చేశారు. ఆయన వెంట న్యాయవాదులు పీఈ సత్యనారాయణ, ఎం.రామారావు, జి.ఫల్గుణరావు, మండల లీగల్ సర్వీస్ కమిటీ సభ్యులు, కోర్టు సిబ్బంది, జైల్ సిబ్బంది శ్యామ్, రవి, పాల్గొన్నారు.

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

- ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా చేయాలి
- జెడ్పీ ఛైర్ పర్సన్ పిరియా విజయ వెల్లడి


జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న పిరియా విజయ

అరసవల్లి:

రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ పిరియా విజయ సూచించారు. జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం జరిగిన జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో విజయ మాట్లాడుతు గ్రామీణ నీటి సరఫరా, ఏపీఈపీడీసీఎల్, వ్యవసాయ శాఖ, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, వైద్య ఆరోగ్యశాఖల ద్వారా జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధి, ఆయా శాఖల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. పలువురు జెడ్పీటీసీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయా శాఖల అధికారులు జవాబు ఇచ్చారు.

సుజలధార నుంచి మంచినీరు

వైఎస్సార్ సుజలధార పేరుతో ప్రారంభమైన ఉద్దానం మంచినీటి పథకం పూర్తిస్థాయిలో పనిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఏ చిన్న పొరపాటుకు తావివ్వరాదని పిరియా విజయ స్పష్టం చేశారు. లీకేజీలు, మెయింటెనెన్స్, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో లోఓల్టేజ్ సమస్యల పరిష్కారం కో సం ఇటీవల కాలంలో 1459 పనులు చేపట్టామని, కొత్తగా ఏడు సబ్ స్టేషన్ లను నిర్మించామని పేర్కొన్నారు. పలువురు సభ్యులు లేవనెత్తిన సబ్ స్టేషన్ల స్థలాల ఆక్రమణలపై నివేదిక సమర్పించాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.శ్రీధర్ మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌కు గాను 1.70 లక్షల హెక్టార్లలో పంటలు పండించేందుకు ప్రణాళికలు రూపొందించామని, దాదాపు 36 వేల క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈనెల 6 నుంచి రైతులకు విత్తనాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. స్వర్ణ 1318 రకం, 1224 రకం ధాన్యం విత్తనాలను ఈసారి అధికంగా పంపిణీ చేస్తామని అందుకు తగ్గట్టుగా స్టాక్ పాయింట్లను సిద్ధం చేశామన్నారు.

33 సగటు పనిదినాల కల్పన

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో ఇప్పటివరకు 33 రోజుల సగటు పని దినాలు కల్పించామని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ చిట్టిరాజు తెలిపారు. ఆ శాఖపై జరిగిన చర్చలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకు జోరుగా పనులు చేపడతామని, అందుకు తగ్గ ప్రణాళికను సిద్ధం చేసినట్టు చెప్పారు. 2025 మార్చి నాటికి జిల్లాలో జాబ్ కార్డు ఉన్న వారందరికీ 75 రోజుల కనీస పని దినాలను కల్పిస్తామని ఒక ప్రశ్నకు ఆయన సమాధానంగా పేర్కొన్నారు. జిల్లాలోని 1.55 లక్షల కుటుంబాలకు వంద రోజుల పని కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు వెల్లడించారు.

ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా వైద్యం, మందులు

వైద్య ఆరోగ్య శాఖపై జరిగిన చర్చలో భాగంగా జిల్లా వైద్య శాఖాఅధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ విధానం ద్వారా అవసరమైన వారికి అన్ని రకాల మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచామని తెలిపారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు సైతం జిల్లాలో మందులు అందుబాటులో ఉన్నాయని, జూన్ నెలలో మలేరియా కేసులు, జూలై నెలలో డయేరియా కేసులు నమోదవుతుంటాయని, వీటికి చెక్ పెట్టేందుకు తగిన ప్రణాళికతో సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలాగా, నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్ ఛైర్ పర్సన్లు సిరిపురపు జగన్, పాలిన శ్రావణి, జెడ్పీ సీఈఓ వెంకటేశ్వరరావు, కళింగ వైశ్య కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ అంధవరపు సూరిబాబు, తూర్పు కాపు కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ మామిడి శ్రీకాంత్, నీటిపారుదల శాఖ ఎస్ఈ పొన్నాడ సుధాకర్, బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, సెట్ శ్రీ సీఈఓ ప్రసాదరావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ పార్వతి


డాక్టర్ డి. పార్వతి

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ డి.పార్వతిని పూర్తి అదనపు బాధ్యతలతో నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం ఆమె గైనికాలజీ విభాగంలో హెచ్ఓడీగా వ్యవహరిస్తున్నారు. శనివారం ఆమె సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సూపరింటెండెంట్‌గా వ్యవహరించిన డాక్టర్ స్వామినాయుడు పదవీ విరమణ చేయడంతో డాక్టర్ పార్వతిని నియమించారు.

నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా
పుయింతోల టోల్‌వే ప్రైవేట్ లిమిటెడ్ SAFEWAY
రిజిష్టర్ ఆఫీస్: Level1 (CE Serviced Offices), Building-10, Tower-A, Cyber Hub, DLF-II, Gurgaon, Haryana - 122002

బహిరంగ ప్రకటన

తేది: 03, జూన్, 2024 నుండి [illegible] టోల్ ప్లాజా వద్ద వర్తించు సవరించిన టోల్ రుసుము వివరములు

[illegible] S.O.No. 3994 (E) [illegible] MoRT&H [illegible] 28-03-2024 [illegible] NHAI HQ [illegible] 245361 [illegible] 30-05-2024 [illegible] 481+600 [illegible] 484+000 [illegible] 3-6-2024 [illegible] 00:00 [illegible] (కి.మీ. 482+525, [illegible] శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్) [illegible]

వాహనం రకం	ఒకవైపు వెళ్ళుటకు రుసుము (రూ.)	24 గంటలలో తిరుగు ప్రయాణ రుసుము (రూ.)	ఒక నెలలో 50 ఒకవైపు ప్రయాణముల కొరకు నెలసరి రుసుము (రూ.)	ప్లాజా ఉన్న జిల్లాలో నమోదైన వాణిజ్య వాహనాలకు (Non-NP) ఒకవైపు ప్రయాణ రుసుము (రూ.)
కారు, జీపు, వ్యాను లేదా తేలికపాటి మోటారు వాహనం	115	170	3795	55
లైట్ కమర్షియల్ వాహనము, లైట్ గూడ్స్ వాహనము లేదా మినీ బస్సు	185	275	6125	90
బస్సు లేదా ట్రక్కు (టూ యాక్సిల్)	385	580	12835	195
మూడు యాక్సిల్ కమర్షియల్ వాహనాలు	420	630	14005	210
భారీ నిర్మాణ యంత్రాలు (HCM) / ఎర్త్ మూవింగ్ పరికరాలు (EME) మల్టీ యాక్సిల్ వాహనాలు (MAV) (4 నుండి 6 యాక్సిల్స్)	605	905	20130	300
అతిభారీ (OS) వాహనాలు (7 అంతకుమించి యాక్సిల్స్)	735	1105	24505	370

(FASTag వినియోగదారులకు మాత్రమే వర్తించును)

టోల్‌ప్లాజా నుండి 20 కి.మీ దూరంలోపు స్థానిక వాణిజ్యేతర వ్యక్తిగత వాహనాలకు వర్తించే నెలసరి పాస్ రూ. 340/- గా నిర్ణయించబడినది.

గమనిక: ఏదైనా వాహనమునకు FASTag లేనియెడల లేదా అది పనిచేయకపోయినా, వర్తించు వాహన రుసుముకు 2 రెట్లు చెల్లించవలెను.
1. పైన తెలిపిన రేట్లు 77.579 కి.మీ. పొడవునకు వర్తిస్తాయి.
2. పై టోల్‌ప్లాజా నందు దిగువ తెలిపిన రాయితీలు లభించును (FASTag వినియోగదారులకు మాత్రమే వర్తించును):
ఎ. అన్ని రకముల వాహనాలకు చెల్లింపు సమయం నుండి 24 గం॥లో తిరుగు ప్రయాణం (25% తగ్గింపు)
బి. అన్ని రకముల వాహనాలకు చెల్లింపు తేది నుండి నెలలో 50 లేదా అంతకంటే తక్కువ ఒకవైపు ప్రయాణాలు (33% తగ్గింపు)
సి. టోల్‌ప్లాజా నుండి 20 కి.మీ.ల పరిధిలో ఉన్న స్థానిక వాణిజ్యేతర వ్యక్తిగత వాహనాల కొరకు ఒక క్యాలెండర్ నెలకు పాస్ (రూ.340/-)
డి. టోల్‌ప్లాజా గల జిల్లాలో నమోదైన వాణిజ్య వాహనం (జాతీయ పర్మిట్ వాహనాలు కాకుండా) ఒకవైపు ప్రయాణం పై 50% తగ్గింపు
3. [illegible] GSR 838 (E) తేది.05-12-2008 మరియు తరువాతి సవరణలు వర్తించును.
4. [illegible] 10 రెట్లు చెల్లించాలి. [illegible]
5. కన్సెషన్ ఒప్పందం తేది: 26-04-2018 ప్రకారం ఒప్పంద కాలం తేది: 29-08-2048 గం.19:59 ని.లకు ముగుస్తుంది.
6. తేది: 29-06-2018 రాజపత్రంలో ప్రచురితమైన టోల్ రుసుము వివరాలు మరియు కన్సెషన్ ఒప్పందానికి సంబంధించిన వివరాల కొరకు http://www.nhai.gov.in వెబ్‌సైట్ ను సందర్శించగలరు.
7. ఏదైనా విచారణ మరియు ఫిర్యాదులు లేదా సలహాలు ఇచ్చుటకు దిగువ పేరు, చిరునామాను సంప్రదించగలరు.

	గుత్తా పట్టాదారు	ఇండిపెండెంట్ ఇంజనీర్	PIU of NHAI
ప్రతినిధి పేరు	శ్రీ యస్. సెంథిల్ కుమార్ ప్రాజెక్ట్ మేనేజర్	శ్రీ యస్. పి. సాహు రెసిడెంట్ ఇంజనీర్	శ్రీ ప్రశాంత్ మండి ప్రాజెక్ట్ డైరెక్టర్
చిరునామా	పుయింతోల టోల్‌వే ప్రైవేట్ లిమిటెడ్ టోల్ నెం.14-40/1, మీనాక్షి ఎన్‌క్లేవ్, [illegible], రాజమహేంద్రవరం రూరల్, ఆంధ్రప్రదేశ్-533107.	[illegible] బరంపూర్, ఒడిస్సా - 760005.	నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా [illegible], ప్లాట్ నెం. 1187, [illegible] బరంపూర్, ఒడిస్సా- 760005.
ఫోన్ నెం.	0883-2411022	9937012167	0680-2951293

మాగుణి చరణ్ కుంవార్ కన్నుమూత


కొయ్య బొమ్మలతో పద్మశ్రీ మాగుణి చరణ్ కుంవార్ (ఫైల్)

భువనేశ్వర్: ప్రముఖ తోలుబొమ్మలాట విద్వాంసుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మాగుణి చరణ్ కుంవార్ (88) శనివారం కన్నుమూశారు. ఆయన దీర్ఘకాలిక అనారోగ్యంతో కెంజొహార్‌లోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యలతో ఆయన ఇటీవల మంచం పట్టారు. పరిస్థితి విషమించడంతో కెంజొహార్ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చేర్చి కొద్ది రోజులు చికిత్స జరిపించారు. ఆయన 2023 సంవత్సరంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రతిష్టాత్మక పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. ఒడిశా సంప్రదాయ రాడ్ (కొయ్య) తోలుబొమ్మల నృత్య రూపాన్ని ప్రోత్సహించి నలు చెరగులా ప్రచారం చేసినందుకు మాగుణి చరణ్ కుంవార్ ప్రతిష్టాత్మక పౌర పురస్కారాన్ని అందుకున్నారు. ఆయన 1937లో కెంజొహార్‌లో జన్మించాడు. ఆయన కొండైనచ్చో (బొమ్మలాట)ను తన తండ్రి బైష్ణవ్ చరణ్ కుంవార్ నుంచి అభ్యసించారు. దేశవిదేశాల్లో తన ప్రతిభను చాటుకున్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

మాగుణి చరణ్ కుంవార్ మృతిపై ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సంతాపం వ్యక్తం చేశారు. పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఒడిశాలో అంతరించిపోతున్న తోలుబొమ్మలాట నృత్య సంప్రదాయాన్ని పునరుద్ధరించడంలో కెంజొహర్‌కు చెందిన గురు మాగుణి చరణ్ కుంవార్ ప్రముఖ పాత్ర పోషించారని ముఖ్యమంత్రి తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. ఎన్నో అవార్డులు, సత్కారాలు అందుకున్న గురు మాగుణి చరణ్ కుంవార్ మరణం ఒడిశా సంప్రదాయ కళకు తీరని లోటని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ముఖ్యమంత్రి ప్రార్థించారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని కూడా తెలియజేశారు.

నక్కొచౌణా ద్వారం ఆవరణలో అగ్ని ప్రమాదం


నక్కొచౌణా ద్వారం ఆవరణలో చెలరేగిన మంటలు

భువనేశ్వర్: పూరీ గుండిచా ఆలయం తూర్పు ద్వారం నక్కొచౌణా ఆవరణలో శనివారం అగ్ని ప్రమాదం జరిగి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో ఆకాశమంతా పొగమయంగా మారింది. ఈ అగ్ని ప్రమాదం శనివారం ఉదయం 5 గంటల ప్రాంతంలో జరిగింది. సమాచారం అందడంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరి మంటల వ్యాప్తిని అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. మంటలు చెలరేగడానికి గల కారణాలను తెలుసుకోవడానికి అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. సమీపంలోని చెత్త కుప్ప నుంచి మంటలు వ్యాపించాయని అనుమానిస్తున్నారు. మూడు రోజుల కిందట స్థానిక నరేంద్ర సరోవరం బాణాసంచా పేలుడు సంఘటన నుంచి కోలుకోక ముందే నొక్కొచౌణా ద్వారం ఆవరణలో మంటలు చెలరేగడం భక్త జనాన్ని కలవర పరుస్తోంది.

అర్ధరాత్రి గాలుల అలజడి


పీఎన్ కాలనీ 2వ లైన్‌లో శుక్రవారం అర్ధరాత్రి వీచిన గాలులకు వాహనంపై కూలిన చెట్టు


జిల్లా కేంద్రంలో విద్యుత్ వైర్లపై పడిన ఫ్లెక్సీని తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

అరసవల్లి:

జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి భీకర గాలులు, వాన అలజడి రేపాయి. గాలుల తీవ్రత అధికంగా ఉండడంతో జిల్లాలో పలు ప్రాంతాల్లో విద్యుత్ శాఖకు కొంతమేరకు నష్టం వాటిల్లింది. చెట్లు నేరుగా విద్యుత్ స్తంభాలపై కూలిపోవడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శుక్రవారం అర్ధరాత్రి ప్రధానంగా జిల్లా కేంద్రంలో పీఎన్ కాలనీ, పాలకొండ రోడ్డు, డేఅండ్‌నైట్‌కూడలి, బొందిలీపురం తదితర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలపై చెట్లు ఒరిగిపోయాయి. విద్యుత్ వైర్లపై పడిపోవడంతో వైర్లు తెగిపడ్డాయి. అలాగే పలుచోట్ల ఫ్లెక్సీలు కూడా విద్యుత్ వైర్లపై పడటంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. అర్ధరాత్రి సమయంలో వర్షం తగ్గినప్పటికీ భారీగా గాలులు వీయడంతో వెంటనే నగరంలో విద్యుత్ సరఫరాను అధికారులు నిలిపివేశారు. అయితే శనివారం ఉదయం నుంచి పునరుద్ధరణ పనులు యుద్ధప్రాతిపదికన చేసినట్లుగా ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి తెలియజేశారు. అయితే పీఎన్ కాలనీ తదితర చోట్ల శనివారం మధ్యాహ్నం వరకు కూడా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేదు.

గాలివాన బీభత్సం

మెళియాపుట్టి: మండలంలోని నందవ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి గాలివాన బీభత్సంలో గ్రామానికి చెందిన సవర పెద్ద సొంబురు, సవర అప్పన్న, సవర చినబాబులకు చెందిన రేకిళ్లు ధ్వంసమయ్యాయి. ఇళ్లలో ఉన్న బియ్యం, నిత్యావసర సరుకులు తడిసిపోయాయి. కొంత మేర నగదు తడిసిపోయినట్లు బాధితులు తెలిపారు. అర్ధరాత్రి వేళ గాలివాన సమయంలో పక్కవీధిలోకి వెళ్లిపోవడంతో ప్రాణాలు కాపాడుకున్నామని, సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.


నందవ గ్రామంలో గాలికి ఎగిరిపోయిన రేకు ఇళ్లు

పిడుగు పాట్లు

సోంపేట: మండలంలో శుక్రవారం రాత్రి పిడుగులు పడడంతో ఎలక్ట్రానిక్ వస్తువులు పాడైపోయాయి. శుక్రవారం రాత్రి వర్షంతో పాటు పిడుగులు పడ్డాయి. రాత్రి కావడంతో ప్రాణనష్టం తప్పింది. మండలంలోని పలాసపురం గ్రామంలో ఇంటిపై పిడుగు పడడంతో ఇల్లు దెబ్బతింది. పరిసర ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్ వస్తువులు మరమ్మతులకు గురయ్యాయి. సోంపేట పట్టణంలో పిడుగులు పడడంతో పలు కుటుంబాలకు చెందిన ఎలక్ట్రానిక్ వస్తువులు పాడైపోయినట్లు పలువురు తెలిపారు.

మూగ జీవాలు మృతి


కంచిలి: ఎక్కల గ్రామం పొలంలో పిడుగు పాటుకు మృతిచెందిన ఆవులు, దూడను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి శిరీష

కంచిలి: మండలంలోని జెన్నాగాయి, ఎక్కల గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో పిడుగు పాటుకు గురై మూగజీవాలు మృతిచెందాయి. జెన్నాగాయి గ్రామానికి చెందిన నల్లాన భాస్కరరావుకు చెందిన ఆవు పిడుగు పడటంతో మృతిచెందింది. ఎక్కల గ్రామంలో నెయ్యిల కాళీ బెహరాకు చెందిన పొలంలో కవిటి మండలం కొండిపుట్టుగ గ్రామానికి చెందిన కోరాడ తరిణయ్య ఆవులు మంద వేశాడు. శుక్రవారం పడిన పిడుగులకు పొలంలో ఉన్న మూడు ఆవులు, ఒక దూడ మృతి చెందాయి.

కంచిలి: మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యుత్ ఉపకరణాలు ధ్వంసమయ్యాయి. ఈ మేరకు ప్రిన్సిపాల్ వి.జగదీష్ శనివారం తెలిపారు. పిడుగు పడి కాలేజీ విద్యుత్ మీటర్, కంప్యూటర్లు, ఇన్వర్టర్, వైర్లు, సీపీయూ ప్రాసెసర్ మొదలైనవి పాడవ్వడంతో రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం పంపినట్లు తెలిపారు.

క్లుప్తంగా

వస్త్ర దుకాణంలో అగ్ని ప్రమాదం



వస్త్ర దుకాణం నుంచి వస్తున్న దట్టమైన పొగలు

సాలూరు: పట్టణంలోని పెద్దబజారులో గల ఓ వస్త్ర దుకాణంలో శనివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక శాఖాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగిందని అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. సుమారు ఐదు లక్షల రూపాయల ఆస్తినష్టం జరిగిందని దుకాణ యజమాని అలివేలు తెలిపారు.

రెండు లారీలు ఢీ..

● ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన లారీ ముందు భాగం

భామిని : మండలంలోని పాలమ వద్ద నిలిచి ఉంచిన లారీని ఎదురుగా వస్తున్న మరో లారీ ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. శనివారం వేకువజామున జరిగిన ఈ ప్రమాదంలో ఎదురుగా వచ్చి ఢీకొన్న లారీ డ్రైవర్, క్లీనర్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో కొత్తూరు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు.

ఏపీఎన్‌జీవీఎఫ్ చైర్మన్‌గా తారకేశ్వరావు



తారకేశ్వరావు

విజయనగరం ఫోర్ట్: ఏపీఎన్‌జీవీఎఫ్(ఆంధ్ర ప్రదేశ్ నాన్‌గజిటెడ్ వెటర్నరీ ఫెడరేషన్) చైర్మన్‌గా సీహెచ్.తారకేశ్వరావు ఎన్నికయ్యారు. అసోసియేషన్ కార్యాలయంలో రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి బి.గోవిందరాజు, డి.కోదండరావు ఆధ్వర్యంలో శనివారం ఎన్నికలు నిర్వహించారు. ఇదివరకు ఏపీఎన్‌జీవీఎఫ్ చైర్మన్‌గా చేసిన పోల గోవిందరావు పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానంలో నూతన చైర్మన్‌గా తారకేశ్వరరావును ఎన్నుకున్నారు.


నైపుణ్యాల పెంపుపై అధ్యాపకులు దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి

నెల్లిమర్ల రూరల్: విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచే విధంగా అధ్యాపకులు కృషిచేయాలని సెంచూరియన్ వర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎన్ రావు అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో అధ్యాపకులకు 'అభివృద్ధి కార్యక్రమం విజన్-2025' అనే అంశంపై శనివారం సెమినార్ నిర్వహించారు. జూమ్ సదస్సులో పాల్గొన్న డీఎన్ రావు మాట్లాడుతూ.. గత పదేళ్లల్లో భారత సంపద రెట్టింపు అయ్యిందని, మరో ఐదేళ్లలో మరింత రెట్టింపు అయ్యే అవకాశం ఉందన్నారు. అందుకు అనుగుణంగా అధ్యాపకులు సన్నద్ధం కావాలని సూచించారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ.. సెంచూరియన్‌లో విజన్-2025 కార్యక్రమం వారం రోజుల పాటు నిర్వహించనున్నట్లు చెప్పారు. అధ్యాపకులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆక్రమణ అడ్డగింత..



ప్రొక్లయినర్‌తో చదును చేస్తున్న దృశ్యం

బొబ్బిలి: పట్టణంలోని ఫ్లై ఓవర్ పక్కన ఉన్న ఎకరంన్నర కోనేరును ఓ ఆక్రమణదారుడు ఆక్రమించుకుని, జేసీబీతో చదునుచేస్తుండగా.. రెవెన్యూ అధికారులు శనివారం అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ప్రభుత్వ చెరువును చదును చేస్తున్న విషయం తెలుసుకున్న వీఆర్‌ఓ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని, ఆర్‌ఐ కల్యాణ చక్రవర్తికి సమాచారం అందించారు. దీంతో రెవెన్యూ అధికారులు వచ్చి జేసీబీని సీజ్ చేశారు. ఆక్రమణదారుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భీమాళి తాండ్ర భలే..

- నాణ్యతకు, రుచికి మారుపేరు
- వేసవి వచ్చిందంటే గ్రామంలో సందడే సందడి
- అనాదిగా మామిడి తాండ్ర తయారీ చేస్తున్న గ్రామస్తులు
- 400 కుటుంబాలకు జీవనాధార



మామిడి తాండ్ర అమ్ముతున్న మహిళ



వెదురు చాపలపై వేసిన తాండ్ర పొరలు

లక్కవరపుకోట: వేసవి వచ్చిందంటే ఆ గ్రామంలో సందడే సందడి. ప్రతి ఇంటిలో చిన్నారుల నుంచి ముసలి వారి వరకు ఎండలో కష్టపడుతూ నోరూరించే మామిడి తాండ్ర తయారీలో బిజీగా ఉంటారు. రాష్ట్రంలో పలుచోట్లతో పాటు జిల్లాలో కూడా చాలా చోట్ల మామిడి తాండ్ర తయారు చేస్తుంటారు. అయినా లక్కవరపుకోట మండలం భీమాళి గ్రామంలో తయారు చేసిన తాండ్ర రుచే వేరు. నాణ్యతకు, రుచికి మారుపేరుగా భీమాళి తాండ్ర ఉంటుందని దేశ, విదేశాలకు చెందిన తాండ్ర ప్రియులు చెబుతుంటారు. ఈ గ్రామంలో సుమారుగా 400 కుటుంబాల వారు అనాధిగా తాండ్ర తయారు చేస్తుంటారు. దేశ, విదేశాల్లో ఉన్న వారు భీమాళి తాండ్ర తెప్పించుకొని మరీ తింటారు.

తయారీ విధానం

తాండ్రను ఎక్కువగా కలెక్టర్, కోలంగోవా వంటి రకాలతోనే చేస్తారు. ఈ రకం పండ్లను బాగ మగ్గ పెట్టి రసం తీస్తారు. తీసిన రసానికి సమపాలల్లో పంచదార కలిపి వెదురు కర్రతో చేసిన చాపలపై పొరలు పొరలుగా వేసి ఎండపెడతారు. ఆ విధంగా నెల రోజుల పాటు వేస్తారు. ఒక్కో చాప నుంచి 60 నుంచి 70 కిలోల దిగుబడి వస్తుంది.

టెంకలతో మామిడి అంట్లు

తాండ్ర చేసేందుకు వినియోగించిన పండ్ల నుంచి వేరుచేసిన టెంకలను వర్షాకాలం వచ్చే సమయంలో పాతర వేసి మొలక కట్టి మామిడి అంట్లుకు ఉపయోగిస్తారు. ఈ మొక్కలు కూడా మంచి దిగుబడి ఇస్తాయని పలువురు చెబుతున్నారు.



తాండ్ర తయారు చేసేందుకు సిద్ధం చేసిన మామిడి పండ్లు



మామిడి పండ్ల నుంచి గుజ్జును తీస్తున్న మహిళలు

గిట్టుబాటు ధర అంతంతమాత్రమే..

మండుటెండల్లో ఎంతో కష్టపడి మామిడి తాండ్ర తయారు చేస్తున్నా గిట్టుబాటు ధర అంతంతమాత్రమే ఉందని తయారీదారులు చెబుతున్నారు. గతేడాదితో పోల్చుకుంటే వంద కిలోల పంచదార సుమారుగా 11 వందల రూపాయలు పెరిగింది. అలాగే తయారు చేసిన తాండ్రను నిల్వ చేసేందుకు కోల్డ్‌స్టోరేజ్‌లు లేకపోవడంతో ఎక్కువ కాలం నిల్వ చేయలేక, వచ్చిన ధరకు అమ్మాల్సిన పరిస్థితి వస్తోందని తయారీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోల్డ్‌స్టోరేజ్ నిర్మించాలని పలుమార్లు కోరినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కూలీల వేతనాలు కూడా బాగా పెరిగిపోయాయి. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి తాండ్రను తయారు చేస్తే కిలో రూ. 120 నుంచి 150 రూపాయల మధ్య విక్రయించాల్సి వస్తోందని, దీంతో చేతిలో పెద్దగా డబ్బులు మిగలడం లేదని తయారీదారులు చెబుతున్నారు.



మామిడి రసంలో పంచదారను కలుపుతున్న దృశ్యం

అమ్మకపు పన్ను రద్దు చేయాలి

భీమాళి గ్రామంలో తాండ్ర తయారీ కుటీర పరిశ్రమగా నడుపుతున్నారు. రైతులు తయారు చేసిన తాండ్రపై అమ్మకపు పన్ను ఉండడంతో కొనుగోలుదారులు గ్రామాలకు రావడం లేదు. దీంతో కొనుగోలుదారుల వద్దకు రైతులే తీసుకెళ్లడంతో వారు అడిగిన ధరకు అమ్ముకోవల్సిన పరిస్థితి వస్తుంది. ఇప్పటికైనా జిల్లాకు, రాష్ట్రానికి ఇంత పేరు తీసకొచ్చే భీమాళి మామిడి తాండ్ర రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుని సౌకర్యాలు కలిపించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రామతీర్థంలో వైభవంగా హనుమాన్ జయంతి



ఆంజనేయ స్వామి సన్నిధిలో పూజలు జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తర్వాత సీతారామస్వామి సన్నిధిలో ఉన్న ఆంజనేయ స్వామికి అర్చకులు విశేష అభిషేకాలు జరిపించారు. అనంతరం తమలపాకులు, సింధూరంతో అర్చనలు నిర్వహించి హనుమాన్ దండకం పఠించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పలువురు ఆంజనేయస్వామి భక్తులు రామతీర్థం తరలివచ్చి భక్తి శ్రద్ధలతో మాల విరమణ చేశారు. ప్రత్యేక పూజలనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పద్మావతి దంపతులు స్వామిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసరావు, అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పద్మావతి దంపతులు

కూరగాయల సాగు.. లాభాలు బాగు...

- జిల్లాలో 1500 హెక్టార్ల విస్తీర్ణంలో కూరగాయలు సాగు
- ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఉభయ గోదావరి జిల్లాలకు ఎగుమతి



రోలుచప్పిడిలో సాగవుతున్న బీర పంట

పూసపాటిరేగ : మెట్ట పంటలైన చెరుకు, పొగాకు, జనపనార సాగుపై ఒకప్పుడు ఆధారపడిన రైతులు ప్రస్తుతం లాభాలు ఆర్జించే కూరగాయల సాగుపై మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి వైపరిత్యాలు సంభవించడంతో వరి, పత్తి, మినుమ సాగు చేసే రైతులు ప్రతి ఏటా నష్టపోతున్నారు. దీంతో ప్రత్యామ్నాయంగా కూరగాయల సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో సుమారు 1500 హెక్టార్లలో.. రబీ సీజన్‌లో 1000 హెక్టార్లలో కూరగాయలు సాగు చేస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా రామభద్రపురం, జామి, నెల్లిమర్ల, మెంటాడ, పూసపాటిరేగ, బొండపల్లి మండలాలలో కూరగాయల సాగు జరుగుతోంది. ఇక్కడ పండిన కూరగాయలను ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంతో పాటు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ఎగుమతి చేస్తుంటారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు ఆర్జించే అవకాశం ఉండడంతో ఎక్కువ మంది రైతులు సాగుకు ముందుకు వస్తున్నారు. వర్షాకాలంలో తమ ప్రాంతంలో పండిన కూరగాయాలకు మంచి డిమాండ్ ఉంటోందని రైతులు చెబుతున్నారు.

రూ. లక్షకు పైబడి..

మండల పరిధిలో ఎక్కువగా బీర, బెండ, వంకాయి, చిక్కుడు, గోరు చిక్కుడు. గుమ్మడి, సొరకాయి, కర్రపెండలం, మునగ, క్యాబేజీ వంటి ఉద్యానవన పంటలు సాగు చేస్తున్నారు. ఎకరా కూరగాయలు సాగుకు 10 నుంచి 15 వేల రూపాయలు ఖర్చు కాగా.. అన్నీపోను ఎకరాకు లక్ష రూపాయల వరకు (రెండు నెలల పంట) ఆదాయం వస్తోందని రైతులు చెబుతున్నారు.

రాయితీపై విత్తనాలు..

కూరగాయలు సాగు చేసే రైతులకు విత్తనాలు రాయితీపై అందజేస్తున్నాం. హెక్టారు విస్తీర్ణానికి సరిపోయే విత్తనాలపై ప్రభుత్వం రూ. 3 వేల వరకు రాయితీ ఇస్తోంది. హైబ్రిడ్ వెజిటబుల్ స్కీమ్ ద్వారా మరిన్ని రాయితీలు కల్పిస్తున్నాం. తీగజాతి కూరగాయలు సాగు చేసే రైతులకు శాశ్వత పందిళ్లు వేయడానికి ప్రభుత్వం సహకారం అందిస్తోంది.

– జ్యోత్స్న, ఉద్యానవనశాఖ అధికారి భోగాపురం.

మరిన్ని రాయితీలు ఇవ్వాలి..

కూరగాయలు సాగు చేసే రైతులకు మరిన్ని రాయితీలు ఇవ్వాలి. ఇతర పంటలకు మద్దతు ధర లేకపోవడంతో ఎక్కువ మంది కూరగాయలు సాగుపైనే ఆసక్తి చూపిస్తున్నారు. వర్షాకాలంలో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– ఆకుల మహాలక్ష్మినాయుడు, రైతు, కనిమెల్ల

బీసీజీ టీకాలు శతశాతం వేయాలి

- జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి భాస్కరరావు



బలిఘట్టంలో క్షయవ్యాధి నివారణ టీకా వేసుకున్న వ్యక్తి వద్ద వివరాలను సేకరిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

కొత్తవలస: క్షయవ్యాధిని నివారించాలనే ఉద్దేశంతో వయోజనులకు బీసీజీ టీకాలు శతశాతం వేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు సూచించారు. మండలంలోని చింతలదిమ్మ, బలిఘట్టాం గ్రామాల్లో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ కార్యక్రమం గత నెల 16న జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ప్రారంభించినట్లు చెప్పారు. ఇప్పటివరకు మూడు వారాలు టీకాలు వేశామని.. మరో 9 వారాల పాటు వేస్తామని తెలిపారు. కార్యక్రమం నిర్వహణలో విజయనగరం జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉందన్నారు. కార్యక్రమం నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఇప్పటివరకు క్షయవ్యాధి నివారణ టీకాలు చిన్నారులకు మాత్రమే వేసేవారమని...ప్రస్తుతం 18 సంవత్సరాలు పైబడిన వారందరికీ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారి సీతల్‌వర్మ, సీహెచ్‌ఓలు చంద్రశేఖర్‌రాజు, కృపా, హెల్త్ ఎడ్యుకేటర్ అనిల్‌ప్రేమకుమార్, పీహెచ్‌ఎన్ రమణమ్మ, హెచ్‌వీ బేబిరాణి, తదితరలు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో జేఎల్‌ఎం మృతి

సంతకవిటి: మండల పరిధిలోని సిరిపురంలో బూరాడ మాధవరావు (31) అనే వ్యక్తి విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. ఎస్సై షేక్ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. సిరిపురం గ్రామానికి చెందిన బూరాడ జగదీశ్వరరావు, రెయ్యమ్మల రెండవ కుమారుడు బూరాడ మాధవరావు(31) మోదుగులపేట సచివాలయంలో జూనియర్ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి గాలితో కూడిన వర్షం కురవడంతో సిరిపురం చెరువు వద్ద 11కేవీ తీగ తెగిపోవడంతో సిరిపురం లైన్‌మన్ గురుగుబెల్లి చిన్నారావు జేఎల్‌ఎం మాధవరావుకు విషయం తెలియజేశారు. దీంతో మాధవరావు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదవశాత్తూ జారి తెగిన విద్యుత్ తీగపై పడి మృతి చెందాడు. మృతుడి తండ్రి జగదీశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజాం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అనుమానాస్పదంగా గుర్తు తెలియని వ్యక్తి..

బొబ్బిలి రూరల్: మండలంలోని రాముడువలస గ్రామ శివారులోని తోటపల్లి కాలువ గట్టు వద్ద అనుమానాస్పదంగా గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు ఎస్సై చదలవాడ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అలజంగి వీఆర్వో అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించామన్నారు. మృతదేహం బాగా కుళ్లి, దుర్వాసన వస్తోందని చెప్పారు. మృతుడి వయసు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంటుందని... మృతుడి ఒంటిపై లుంగీ, చొక్కా ఉన్నాయని తెలిపారు. మృతుడి ఆచూకీ కోసం చుట్టుపక్కల గ్రామాల్లో దండోరా వేయించినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చదలవాడ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

గజపతినగరం రూరల్: మండలంలోని లోగిశ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సామంతుల పైడిరాజు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. బంధువులు తెలియజేసిన సమాచారం మేరకు... నాలుగు రోజుల కిందట బహిర్భూమికి వెళ్లిన సామంతులకు పాము కరిచింది. దీంతో ఆయన్ను జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పడాల అరుణ, వైఎస్సార్‌సీపీ నాయకులు మండల సురేష్, కరణం ఆదినారాయణ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ఎన్‌సీసీ క్యాడెట్‌లకు ఫైరింగ్ శిక్షణ



ఫైరింగ్ శిక్షణలో ఎన్‌సీసీ క్యాడెట్స్

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ-2(ఏ) గర్ల్స్ బెటాలియన్ వార్షిక శిక్షణ తరగుతులు శనివారం కొనసాగాయి. ఇందులో భాగంగా సారిపల్లి గ్రామంలో సీనియర్ క్యాడెట్స్‌కు ఫైరింగ్‌పై శిక్షణ, జూనియర్ క్యాడెట్స్‌కు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఫైరింగ్ శిక్షణలో 25 మీటర్ల రేంజ్‌లో 0.22 రైఫిల్స్‌తక్ష ప్రాక్టీస్ చేయించారు. ఈ సందర్భంగా కల్నల్ గోపేంద్ర మాట్లాడుతూ ఫైరింగ్ శిక్షణ దేశరక్షణకు దోహదపడుతుందన్నారు. జూనియర్ క్యాడెట్స్‌కు రాకోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్.బి.అఖిల అవగాహన కల్పించారు. అనంతరం ఫైరింగ్‌లో ప్రతిభచూపిన పలువురిని ప్రశంసించారు. శిక్షణ తరగతులకు విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన 600 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్ హాజరయ్యారు. కార్యక్రమంలో డిప్యూటీ క్యాంపు కమాండెంట్ కెప్టెన్ మీసాల సత్యవేణి, సబేదార్ మేజర్ బొడ్లే, ఎన్‌సీసీ శిక్షణ అధికారులు మజ్జి వరలక్ష్మి, వెంకటరత్నం, సంతోషి, వరలక్ష్మి, తులసి, లక్ష్మీప్రసన్న, గౌరీ, వెంకట రమణమ్మ పాల్గొన్నారు.

సబ్ జైల్‌ను సందర్శించిన జిల్లా జడ్జి

పాలకొండ: పాలకొండ సబ్‌జైల్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునాయిద్ అహ్మద్ మౌలానా శనివారం సందర్శించారు. ఖైదీలతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. రికార్డులు, ఖైదీల గదులు, వంటసాల తదితరవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైల్‌లో మంచి వాతావరణం కల్పించాలని సిబ్బందికి సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఖైదీల వివరాలపై ఆరా తీశారు. బెయిల్ మంజూరుకాకపోవడానికి కారణాలను జైల్ అధికారి జోగులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సబ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి విజయరాజ్ కుమార్ ఉన్నారు.

ఉదయం 8 గంటలకే కౌంటింగ్ ప్రారంభం



పాల్గొన్న నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, ఏఆర్‌ఓలు

- వీలైనంత వేగంగా ఓట్ల లెక్కింపు
- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగమణి, జేసీ కె.కార్తీక్

విజయనగరం అర్బన్: సార్వత్రిక ఎన్నికల లెక్కింపు ప్రక్రియ ఈ నెల 4న ఉదయం 8 గంటలకే ప్రారంభించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తాజాగా ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన ఆదేశాలను కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆర్వోలకు తెలియజేశారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రారంభించాలన్నారు. దీని కోసం 7.30 గంటలకే ట్రంకు బాక్సులు లెక్కింపు కేంద్రాల్లోకి తరలించి, 500 చొప్పున కట్టలు కట్టి టేబుళ్ల వద్దకు చేర్చాలని సూచించారు. ప్రాథమిక లెక్కింపులో మొదటి రౌండ్ గంట సమయం తీసుకున్నప్పటికీ రెండో రౌండ్ నుంచి 45 నిమిషాల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండో దశలో చేపట్టే పోస్టల్ ఓట్ల సమగ్ర లెక్కింపు ప్రక్రియలో ఒక్కో రౌండ్ లెక్కింపు పూర్తయ్యేందుకు గంటన్నర కంటే ఎక్కువ సమయం తీసుకోకూడదన్నారు. ఈటీపీబీ లెక్కింపు కూడా వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఉదయం 7.30 గంటలకు స్ట్రాంగ్‌రూంలను తెరవాలని, ఈ ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేయించాలని చెప్పారు. ఉదయం 8.30 గంటలకు ప్రారంభమయ్యే ఈవీఎం ఓట్ల లెక్కింపులో ఒక్కో రౌండ్ 20 నిమిషాలలోపే పూర్తి చేయాలని ఆదేశించారు. అందుకు అనుగుణంగా 8.15 గంటలకే కంట్రోల్ యూనిట్లను కౌంటింగ్ టేబుళ్లవద్దకు చేర్చాలని సూచించారు. ప్రతీరౌండ్ పూర్తయిన వెంటనే ఫలితాలను తప్పులు లేకుండా ఎన్‌కోర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. నిర్ణీత సమయానికి ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని ప్రారంభించి సజావుగా వేగంగా ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ కోరారు. కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం 6.45 గంటలకల్లా లెక్కింపు కేంద్రాల వద్ద సిద్ధంగా ఉండేలా చూడాలని సూచించారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక ఫారమ్-20 రిజల్ట్ షీట్, ఫారమ్-21సీ, ఫారమ్-21ఇ, ఫారమ్-22 తదితర పత్రాలను తప్పులు లేకుండా కచ్చితమైన వివరాలతో పూర్తి చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ సెంటర్లలో ఏర్పాట్లన్నీ ఆదివారం సాయంత్రానికి పూర్తి చేయాలని, సిబ్బందికి 3వ తేదీన ప్రత్యక్ష శిక్షణ ఇవ్వాలని సూచించారు. కౌంటింగ్ ముగిసిన తరువాత నిబంధనల ప్రకారం ప్యాకింగ్, సీలింగ్ ప్రక్రియలను పూర్తిచేసి, మరునాడు ఉదయం గోదాములకు తరలించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన తాజా ఆదేశాలను కలెక్టర్ వివరించారు. సమావేశంలో జేసీ కె.కార్తీక్, డీఆర్వో ఎస్.డి.అనిత, నోడల్ అధికారులు, వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఏఆర్వోలు పాల్గొన్నారు.